సాక్షి
వరంగల్
శనివారం | 16 | ఆగస్టు | 2025



సాంకేతికాభివృద్ధిలో కొత్త ఒరవడి

టీజీ ఎన్పీడీసీఎల్‌లో సీఎండీ వరుణ్‌రెడ్డి సాంకేతికంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రావు అన్నారు.

- 8లో▸



సంఘాలను పటిష్టం చేయాలి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత పటిష్టం చేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
28°/23°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందడి

- రుద్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



హన్మకొండ కల్చరల్ : చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా రుద్రేశ్వరస్వామి వారిని విభూది, గంధంతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, మహా హారతి నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రభాతసేవ, గణపతికి అభిషేకం, రుద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు.

భద్రకాళి దేవాలయంలో..

భద్రకాళి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శ్రావణమాస పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో సందర్శించారు. మేయర్ గుండు సుధారాణి ఒడిబియ్యం, చీర సమర్పించారు. న్యూఢిల్లీకి చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోస్ట్ జితేంద్రగుప్తా, సీపీఎంజీ తెలంగాణ పీవీఎస్ రెడ్డి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. వారితో పాటు వరంగల్ ఎస్పీ రవికుమార్, హనుమకొండ ఎస్పీ హనుమంతు, సీతారాం, వెంకన్న ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ రామల సునీత ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా వరంగల్‌లోని సద్గురు శివానందమూర్తి గురుసప్తధామంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం రాజరాజేశ్వరి దేవి అమ్మవారిని, శ్రీచక్రాన్ని పూలమాలతో అలంకరించారు. అమ్మవారి ఉపాసకులు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి శ్రీచక్రార్చన పూజలు నిర్వహించారు. హంటర్‌రోడ్డులోని సంతోషిమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. నగరంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'నవోదయ' గడువు పెంపు

మామునూరు : వరంగల్ మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పూర్ణిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న చివరి తేదీ ఉండగా.. విద్యాలయ సమితి మరోమారు గడువు పెంచుతూ అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

కమిషనరేట్‌లో పంద్రాగస్టు వేడుకలు



వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీపీ సన్‌ప్రీత్‌సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది, చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావు, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఆర్‌ఐలు, ఇన్‌స్పెక్టర్లు, పరిపాలన విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం.. వేతనాల్లో కోత

రామన్నపేట : విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి అనుమతి లేకుండా గైర్హాజరైన ఆరుగురు జవాన్ల వేతనాల్లో కోత విధిస్తున్నట్లు బల్దియా సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి శుక్రవారం తెలిపారు. 9,10 డివిజన్లలో క్షేత్రస్థాయిలో హాజరును తనిఖీ చేసే క్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది కనీసం 50 శాతం హాజరు నమోదు కాలేదని, 3–4 రోజులు వారి పనితీరును గమనించి విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఆరుగురు జవాన్ల వేతనంలో ఒక రోజు కోత విధించినట్లు పేర్కొన్నారు. ఇలాగే నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే కఠిన చర్యలతో పాటు విధుల నుంచి తొలగిస్తామని సీఎంహెచ్ఓ హెచ్చరించారు.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

వరంగల్‌ను రెండో రాజధానిగా గుర్తిసాం

- మామునూరు విమానాశ్రయం కల త్వరలో సాకారం
- 79వ స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- మధ్యకోటలోని ఖుష్‌మహల్ మైదానంలో జాతీయ జెండావిష్కరణ
- అలరించిన పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద



స్వాతంత్ర్య దినోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

సాక్షి వరంగల్/ఖిలా వరంగల్: జిల్లా సమగ్రాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరంగల్ నగరాన్ని రెండో రాజధానిగా గుర్తించి హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించామని పేర్కొన్నారు. ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ మైదానంలో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై కలెక్టర్ సత్యశారద, ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్‌తో కలిసి మంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2057 నగర జనాభాను దృష్టిలో పెట్టుకుని త్వరలోనే రూ.4,100 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభిస్తామని, మామునూరు విమానాశ్రయం కల త్వరలో సాకారం చేస్తామని, ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల ప్రజలకు ప్రయోజనం ఉంటుందని స్పష్టం చేశారు. భూ సేకరణకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లు విడుదల చేసిందని చెప్పారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు వేగవంతం..

గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన చేసి గాలికి వదిలేసిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు వేగవంతం చేశామని, నర్సంపేటలో వైద్య కళాశాల, జిల్లా ఆస్పత్రిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రారంభించుకున్నామని తెలిపారు. కలెక్టరేట్ పనులు తదిదశకు చేరాయని, అధునాతన సౌకర్యాలతో వరంగల్ బస్టాండ్ నిర్మిస్తున్నామని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని వివరించారు. అటవీ శాఖ ద్వారా గత ఏడాది 26 లక్షల మొక్కలు నాటామని, ఈ ఏడాది 31 లక్షల మొక్కలు నాటాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాకాల బయోడైవర్సిటీ పార్కు అభివృద్ధి, భద్రకాళి ఆలయ మాడవీధులు, రాజగోపురాల పనులు సాగుతున్నాయని స్పష్టం చేశారు. మహాలక్ష్మి పథకం కింద కోట్లాది మంది మహిళలు ఉచిత బస్సు సౌకర్యం పొందుతున్నారని, గృహలక్ష్మితో రూ.500కు సిలిండర్లు అందుకుంటున్నారని, గృహజ్యోతి కింద లక్ష మందికిపైగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వినియోగించుకుంటున్నారని తెలిపారు.

మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి రుణాలు..



బ్యాంకు లింకేజీ కింద 7,933 స్వశక్తి మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి రూ.475 కోట్ల రుణాలు మంజూరు చేసి రికవరీ చేసినందుకు జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు లభించడం అభినందనీయమని అన్నారు. 75వేల వ్యవసాయ బావులకు 24 గంటలు, సెలూన్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, సీజనల్‌లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని వివరించారు. ఈ ఏడాది ఐదు వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నామని, మత్స్యశాఖ ద్వారా 11 వేల టన్నుల చేపలు, రొయ్యలు ఉత్పత్తి చేశామని, రిజర్వాయర్ల, మధ్యతరహా చెరువుల్లో 82 లక్షల చేప పిల్లలను వేసి 16 వేల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూర్చామని పేర్కొన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏఎస్పీ శుభం, డీఆర్‌ఓ విజయలక్ష్మి డీఎస్‌ఓ కిష్టయ్య, డీఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు ఇక్బాల్, బండి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తములకు ప్రశంసపత్రాలు

- 8లో▸



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారద



నృత్యాన్ని ప్రదర్శిస్తున్న పాఠశాల విద్యార్థినులు



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించిన మంత్రి పొంగులేటి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద

'రేషన్'కు కొత్త బ్యాగులు

- ఏనుమాముల గోదాంకు చేరిన సంచులు



ఏనుమాముల ఎంఎల్ఎస్ పాయింట్‌కు చేరిన సంచులు



రేషన్‌కార్డు దారులకు పంపిణీ చేయనున్న చేతి బ్యాగు

ఖిలా వరంగల్: జిల్లాలోని ఏనుమాముల, వర్ధన్నపేట, నర్సంపేట ఎంఎల్ఎస్ పాయింట్లకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ ముద్రించిన కొత్త సంచులు చేరుకున్నాయి. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి అన్ని చౌకధరల దుకాణాల్లో ప్రతికార్డు దారుడికి ఉచితంగా 'సన్నబియ్యం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం' అని ముద్రించిన బ్యాగులను డీలర్లు పంపిణీ చేయనున్నారు. దీంతో వినియోగదారులు ఇంటినుంచి బ్యాగు తెచ్చే అవకాశం ఉండకపోవచ్చు. ఈ సంచిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు ఉన్నాయి.

విరబూసిన బ్రహ్మకమలం



వంచనగిరిలో విరబూసిన బ్రహ్మకమలం పుష్పం

గీసుకొండ: మండలంలోని వంచనగిరి గ్రామానికి చెందిన మాదినేని బాలస్వామి ఇంటిలో రెండేళ్ల క్రితం నాటిన బ్రహ్మకమలం మొక్క విరబూసింది. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మువ్వన్నెల జెండా రెపరెపలాడిన శుభ సమయంలో బ్రహ్మకమలం విచ్చుకుని కనువిందు చేయడం విశేషం. సాధారణంగా బ్రహ్మకమలం మొక్క హిమాలయ పర్వతాలు, ఉత్తరప్రదేశ్, బర్మా, టిబెట్ , చైనా, నేపాల్ దేశాల్లో కనిపిస్తుంది. ఇలాంటి అరుదైన మొక్కను రాజమండ్రి నుంచి కొనుగోలు చేసి బాలస్వామి ఇంటి ఆవరణలో నాటగా తాజాగా ఓ పువ్వు పూసింది. ఏడాదికోసారి బ్రహ్మకమలం మొక్క పువ్వు పూస్తుందని, శివుడిని ఆరాధించడానికి ఈ పుష్పాన్ని ఉపయోగిస్తారని ఆయన తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- 17, 18 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- కలెక్టర్ డాక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వర్షాల వల్ల నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, పలు పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదకర పరిస్థితులు లేనప్పటికీ చెరువులు, వాగులు, వంకలు తదితర ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా రోడ్డు మార్గాలను డైవర్ట్ చేయాలన్నారు. ఇందుకు పోలీసు, గ్రామ కార్యదర్శుల సహకారం తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా చూడాలని, శిథిలావస్థలో ఉన్న గృహాలు, పాఠశాలలను గుర్తించి అందులో ఉండే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. డ్రైనేజీలను మరమ్మతు చేయాలని, వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా డ్యాంలు, చెరువుల స్థితిగతులను నిరంతరం పరిశీలించాలని, ముంపు ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాల వల్ల తెగిపోయిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈనెల 17, 18 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల స్థాయి టీంలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అధికారులు సెలవులో వెళ్లకుండా హెడ్ క్వార్టర్స్‌లోనే ఉంటూ వర్షాలతో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, వైరల్ ఫీవర్ ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిషత్ సీఈఓ రాంరెడ్డి, ఇరిగేషన్ ఈఈలు శంకర్, సునీత, జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించాలి

- స్వాతంత్ర్య సమరయోధుల వినతి



స్వాతంత్ర్య సమరయోధుడితో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

హన్మకొండ అర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలని స్వాతంత్ర్య సమరయోధులు కోరారు. ఈ మేరకు మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హనుమకొండ పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ.. స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించే క్రమంలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తాము భూ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విన్నవించినా పట్టించుకోలేదని అన్నారు. కాగా, మంత్రి ఆ వినతిని కలెక్టర్ స్నేహ శబరీష్‌కు ఇచ్చి పరిశీలించాలని సూచించారు.

పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



గద్ద వెంకటేశ్వర్లుకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట: ఇందిరాగాంధీ స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు, 24వ వార్డు ప్రజలతోపాటు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 50 కుటుంబాలు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ మేరకు ఎమ్మెల్యే మాధవరెడ్డి వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, తెల్లరేషన్ కార్డులు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత కరెంట్ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ గద్ద వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడం అభినందనీయం అన్నారు. విద్యావంతులు, ఉద్యోగులు, విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 24వ వార్డులోని సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, ఎమ్మెల్యే సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేదర్, 24వ వార్డు అధ్యక్షుడు కోలా చరణ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య, ఓబీసీ వరంగల్ అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, జిల్లా కమిటీ అధ్యక్షురాలు పార్వతమ్మ, మాజీ సర్పంచ్ చిలువేరు రజనీభారతి, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రవి, జిల్లా కార్యదర్శి నూనె పద్మ, పట్టణ అధ్యక్షురాలు కీర్తన, పట్టణ ప్రధాన కార్యదర్శి గద్ద జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ కాంగ్రెస్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి



సైన్స్ కాంగెస్ నిర్వహణ కమిటీతో సమీక్ష నిర్వహిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 19, 20, 21వ తేదీల్లో తలపెట్టిన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టాస్) జనరల్ సెక్రటరీ, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ కోరారు. శుక్రవారం కేయూ అకడమిక్ కమిటీ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డితో కలిసి సైన్స్ కాంగ్రెస్ నిర్వహణపై మానిటరింగ్ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సత్యనారాయణ పాల్గొని పలు సూచనలు చేశారు. స్పీకర్లుగా వచ్చే ప్రముఖ సైంటిస్టులకు వసతి తదితర ఏర్పాట్లపై చర్చించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్.మోహన్‌రావు హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్‌లో పలు సూచనలు చేశారు. ఈసారి సదస్సులో ప్రధాన థీమ్‌గా సాధికారిత కోసం వినూత్న పుణ్యాలు-యువభారతాన్ని మార్చడంలో శాస్త్ర సాంకేతికత అనే అంశంపై చర్చించనున్నారు. మరో ఏడు సబ్ థీమ్స్‌లో వివిధ లైఫ్ సైన్సెస్ విభాగాల్లోను అధ్యాపకులు, పరిశోధకులు విద్యార్థుల పేపర్ల ప్రజంటేషన్స్, పోస్టర్ల ప్రజంటేషన్స్ ఉంటాయి. ప్రతి థీమ్‌లో బెస్ట్ పేపర్, పోస్టర్ ప్రజంటేషన్‌లను ఎంపిక చేసి ప్రశంసపత్రాలు అందజేయాలని నిర్ణయించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.వెంకట్రాంరెడ్డి, లోకల్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, టెక్నికల్ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ పి.మల్లారెడ్డి, టి.మనోహర్ పాల్గొన్నారు.

కేయూ వివేచన న్యూస్‌లెటర్ విడుదల..

కేయూ వివేచన న్యూస్‌లెటర్‌ను వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రంతో కలిసి విడుదల చేశారు. ఆరు నెలలుగా వర్సిటీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలతోపాటు ఆచార్యుల అవార్డులు, అచీవ్‌మెంట్స్, కాకతీయ యూనివర్సిటీలో చేపట్టిన ప్రాంగణ నియామకాలు తదితర అంశాలను పొందుపర్చి వివేచన న్యూస్‌లెటర్‌గా విడుదల చేశారు.

మెట్రోనగరాల సరసన వరంగల్

- స్వాతంత్ర్య వేడుకల్లో మేయర్ సుధారాణి



జెండాకు వందనం చేస్తున్న మేయర్ సుధారాణి

రామన్నపేట : రానున్న రోజుల్లో వరంగల్ మహానగరం దేశంలోని ఇతర మెట్రో నగరాల సరసన నిలుస్తుందని మేయర్ గుండు సుధారాణి అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవంలో ఆమె కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ నగర ప్రజల చిరకాలవాంచ అయిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను రూ.4,100 కోట్లతో చేపట్టేందుకు రంగం సిద్ధమైందన్నారు. ఇందులో భాగంగానే రూ.158 కోట్లతో వరద ముంపు నివారణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సాస్కీ సంస్కరణల ద్వారా నగర అభివృద్ధికి రూ.200 నుంచి రూ.250 కోట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

డీలర్లు లైసెన్స్ కలిగి ఉండాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట: డీలర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, 1985 ఎరువుల నియంత్రణ చట్టం నియమనిబంధనలు పాటించాలని, పీఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే అమ్మకాలు చేపట్టాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. ఉప్పరపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, ఓడీసీఎంఎస్ కేంద్రాలు, ప్రైవేట్ దుకాణాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి రైతు దగ్గర నుంచి ఆధార్‌కార్డు వివరాలు సేకరించి మాత్రమే ఎరువుల విక్రయాలు జరపాలని ఆదేశించారు. అలాగే, వ్యవసాయశాఖ అధికారులు నిరంతరం విక్రయ కేంద్రాలను తనిఖీలు చేయాలని, క్షేత్రస్థాయిలో ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ నిర్వహణకు ఏర్పాట్లు చేయండి

వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ స్కూల్ పనులను శుక్రవారం కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న తరగతి గదులు, ఎంత మందికి వసతి కల్పిస్తున్నారనే వివరాలను డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్‌ను, ఎప్పటి వరకు పనులు పూర్తి చేస్తారని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 25వ తేదీలోగా తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం ఎక్స్‌లెన్స్ సెంటర్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్‌బాబు, అధికారులు నరేందర్‌రెడ్డి, రవీందర్, డీఎస్ఏ కోచ్‌లు ఉన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థిని సిరి

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థిని దైనంపల్లి సిరి తొమ్మిదో తరగతి చదువుతుంది. శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వేడుకల ఏర్పాట్లలో భాగంగా స్టీల్ పైప్‌తో కూడిన జెండాలను పట్టుకుని వెళ్తున్న క్రమంలో పాఠశాల ఆవరణలో విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యార్థిని సిరి చేతికి, కాలుకు గాయాలు అయ్యాయి. గమనించిన పాఠశాల సిబ్బంది హుటాహుటిన స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న బాలికను పరామర్శించారు.

ఉత్తములకు ప్రశంసపత్రాలు


టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు, నగదు బహుమతి అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారద

విధుల్లో ఉత్తమ సేవలందించిన పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ప్రశంసపత్రాలు అందుకున్నారు. ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్య్ర దినోత్సవంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద వారికి ప్రశంసపత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. వేడుకల్లో మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు పాల్గొన్నారు. -సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, వరంగల్


ఎం.విజయలక్ష్మి, డీఆర్వో | సురేఖ, డీఎంఓ | ఎం.శ్రీనివాస్, తహసీల్దార్, రాయపర్తి | ఎం.కృష్ణ, తహసీల్దార్, నల్లబెల్లి


ఎ.నర్సయ్య, ఏసీపీ | ఎ.సురేంద్ర, ఏసీపీ | ఎస్.రాజు, ఇన్‌స్పెక్టర్ | ఇసగాల చారిటబుల్ ట్రస్ట్, హనుమకొండ | ఎస్.శ్రీనివాస్, ఆర్ఐ | ఎం.శివకేశవులు, ఆర్ఐ | డి.రమేశ్, ఆర్ఎస్సై | శరత్, ఆర్ఎస్సై | రత్నాకర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ | గౌతమ్‌యాదవ్, పారా తైక్వాండో మెడలిస్ట్ | సత్యనారాయణ, ఏసీపీ | కె.రాంకుమార్‌రెడ్డి, హెచ్ఓడీ ఆర్థోపెడిక్స్ | జి.హనుమంత రావు, హెచ్ఓడీ అనస్థీషియా


స్వర్ణలత, గైనకాలజిస్ట్ | క్రాంతికుమార్, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ | దొమ్మాటి ప్రసన్న కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎంజీఎం | డాక్టర్ అర్చన, పీఓ ఎంహెచ్ఎన్ | డాక్టర్ గీతారాణి, సివిల్ అసిస్టెంట్ సర్జన్ | కె.గోపిక, అసిస్టెంట్ ప్రొఫెసర్ | ఎన్.శ్రీవాణి, ఎంపీడీఓ, చెన్నారావుపేట | మాధవరావు, డీఈఈ, ఇరిగేషన్ | డాక్టర్ వల్లె రాజు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ | ఎం.శ్రీధర్‌గౌడ్, ఎంపీఓ | సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ జైలర్ | దుర్గా ప్రతాప్ సింగ్, సీనియర్ అసిస్టెంట్ | రాధిక, సీనియర్ అసిస్టెంట్


ఎన్.లలిత, నర్సింగ్ ఆఫీసర్ | సుజన్‌తేజ, ఏఎంఓ | కె.ఫ్లారెన్స్, జీఈసీఓ | కె.రాజేశ్, జూనియర్ అసిస్టెంట్ | కొమురయ్య, ఓఎస్ | వెంకటయ్య, వాచ్‌మెన్ | శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్, వర్ధన్నపేట | మహేందర్, ఇన్‌స్పెక్టర్, గీసుకొండ | కృష్ణవేణి, ఎస్సై | రాజేశ్వరి, ఏఎస్సై | విజయ, ఏఎస్సై


షమీనా బేగం, పీసీ | మౌనిక, జూనియర్ అసిస్టెంట్ | సారంగపాణి, పీసీ | ఎన్.కృపాకర్, హోంగార్డు | వేణు కానిస్టేబుల్ | గంగాధర్, ఎంపీడీఓ కార్యాలయ టైపిస్ట్ | శివకుమార్, పారా తైక్వాండో మెడలిస్ట్ | రాజగోపాల్, సీఐ పర్వతగిరి | ప్రవీణ్, ఎస్సై పర్వతగిరి | అనన్య, కానిస్టేబుల్ | కత్తెరపల్లి రాజు, జీపీ సెక్రటరీ

డెంగీతో బాలిక మృతి


శాన్విక (ఫైల్)

వేలేరు: డెంగీ జర్వంతో బాలిక మృతి చెందింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సూత్రపు రమేష్ కూతురు శాన్విక(7)కు ఐదు రోజుల క్రితం జర్వం రాగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానాకు తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు డెంగీగా గుర్తించి చికిత్స చేస్తున్న క్రమంలో శుక్రవారం ఉదయం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దంత వైద్యశిబిరానికి స్పందన


టూత్‌పేస్ట్ అందజేస్తున్న డాక్టర్ గిరిధర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: భారత స్వాతంత్య్ర దినోత్సవం, ఎస్‌వీఎస్ దంత వైద్యశాల 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ చౌరస్తాలోని దంత ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని అనూహ్య స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ గిరిధర్‌రెడ్డి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, టూత్‌పేస్టులు, మౌత్ వాష్‌లు అందజేశారు. దంతాల పరిరక్షణపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. వైద్య శిబిరంలో వైద్యులు గణేష్, హారిక, సిబ్బంది యాకూబ్‌రెడ్డి, సౌమ్య, చంద్రిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య


సాయివర్ధన్ (ఫైల్)

బచ్చన్నపేట: తండ్రి మందలించాడని మనస్తాపంతో విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని లింగంపల్లిలో గురువారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, ఎస్సై అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేడబోయిన నర్సమ్మ-మల్లయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. చిన్న కుమారుడు సాయివర్ధన్ (20) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. సాయివర్ధన్ సరిగా చదవడంలేదని తండ్రి మల్లయ్య మందలించాడు. దీంతో సాయివర్ధన్ క్షణికావేశంలో తమ బావి వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి


బన్నీ (ఫైల్)

పెద్దవంగర: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన గద్దల బన్నీ (17) తన చిన్నతనంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో అమ్మమ్మ గ్రామమైన ఉప్పరగూడెంలో తాత కొమురయ్య సంరక్షణలో పెరిగాడు. పదో తరగతి పూర్తి కావడంతో ప్రస్తుతం నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రాఖీ పౌర్ణమితోపాటు వరుస సెలవులు రావడంతో అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. శుక్రవారం తాత పొలం పనులకు వెళ్లాడు. అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై క్రాంతికిరణ్‌ను వివరణ కోరగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించామని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడతామని తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదన్నారు.


వాజేడు: కనువిందు చేస్తున్న బొగత జలపాతం

బొగత కనువిందు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని బొగత జలపాతం శుక్రవారం ఉధృతంగా ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది. దండకారణ్యంలోని కర్రె గుట్టలపై గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో పైన ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జలపాతానికి భారీగా వరద వస్తోంది.




పాకాల మత్తడి పరవళ్లు


సరస్సు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దొంతి

ఖానాపురం:వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు మత్తడి పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో సరస్సులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు. శుక్రవారం మత్తడి పోయడంతో ప్రజలు మత్తడి వద్ద సందడి చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మత్తడిని సందర్శించి పూజలు చేశారు.

సంఘాలను మరింత పటిష్టం చేయాలి

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు


సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రవీందర్ రావు, డైరెక్టర్లు

హన్మకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత పటిష్టం చేయాలని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీసీబీలు, టెస్కాబ్ పాలకవర్గాలకు ప్రభుత్వం ఆరు నెలలు పొడిగింపు ఇచ్చిన సందర్భంగా శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చిత్రపటాలకు పాలక వర్గంతో కలిసి రవీందర్ రావు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సేవ చేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. వరంగల్ డీసీసీబీని ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామన్నారు. వ్యవసాయ రంగానికి సేవలు విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ డైరెక్టర్లు హరిప్రసాద్, మాడుగుల రమేష్, దొంగల రమేష్, ఎర్రబెల్లి గోపాలరావు, మురళి, సంపెల్లి నరసింగరావు, నరేందర్ రెడ్డి, పోలపాక శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు రాజేష్ ఖన్నా, రామచంద్ర రావు, లక్ష్మారెడ్డి, దేవేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ గౌడ్, డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికాభివృద్ధిలో కొత్త ఒరవడి

- టీజీ ఎన్పీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రావు



మాట్లాడుతున్న వంగూరు మోహన్ రావు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సాంకేతికంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని ప్రాజెక్టు డైరెక్టర్ వంగూరు మోహన్‌రావు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మోహన్‌రావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఏపీటీఎస్-విజిలెన్స్ వారిచే గౌరవ వందనం స్వీకరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగ అమరులకు కార్యాలయం ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో 18 జిల్లాల్లో 70 లక్షల మంది వినియోగదారులకు 24/7 మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2024 సంవత్సరం (ఏప్రిల్ నుంచి జూలై) తో పోల్చుకుంటే 33 కేవీ బ్రేక్ డౌన్స్ 2025 (ఏప్రిల్ నుంచి జూలై) లో 21శాతం, 11 కేవీ బ్రేక్ డౌన్లు 46శాతం తగ్గాయన్నారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సీఎండీ వరుణ్ రెడ్డి స్వీయ ఆలోచనతో రూ. కోటి బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. పునరుత్పాదక శక్తి జూన్ 30, 2025 నాటికి ఎన్పీడీసీఎల్‌లో 2155.87 మెగావాట్ల సోలార్ ఎనర్జీ జనరేషన్ సామర్థ్యాన్ని సాధించామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వంటేరు తిరుపతి రెడ్డి, మధుసూదన్, చీఫ్ ఇంజనీర్లు అశోక్ కుమార్, తిరుమల్‌రావు, రాజుచౌహాన్, అశోక్, వెంకటరమణ, మాధవరావు, సీజీఎంలు చరణ్ దాస్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరి రమేష్, కంపెనీ కార్యదర్శి వెంకటేశం, వరంగల్ ఏపీటీఎస్ సీఐ కిరణ్ పాల్గొన్నారు.

నలుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

- 25 కిలోల 800 గ్రాముల గంజాయి, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నరసింహారావు


నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ నరసింహారావు

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ డ్రగ్స్ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో నలుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నరసింహారావు వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం హనుమకొండ కుమార్‌పల్లిలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ దగ్గర నలుగురు వ్యక్తులు ఎండు గంజాయి కలిగి ఉన్నారని వచ్చిన సమాచారంతో నార్కొటిక్స్ సీఐ శ్రీకాంత్, ఎస్సై సీహెచ్ పరుశురాములు, సిబ్బందితో కలిసి వెళ్లి కారులో గంజాయిని తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన ఎండీ ఫైజాన్, ఎస్‌డీ అన్సార్, ఎండీ అర్బాన్, కుమార్‌పల్లికి చెందిన అర్షద్ అలీఖాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి 25కిలోల 800గ్రాముల ఎండు గంజాయితోపాటు ఐదు సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఫైజాన్, అన్సార్, అర్బాన్.. ఆంధ్రప్రదేశ్- ఒడిశా బార్డర్ వద్ద బాలు అనే వ్యక్తి నుంచి గంజాయిని తీసుకొచ్చి హనుమకొండలోని కుమార్‌పల్లి చెందిన అర్షద్ అలీఖాన్ ఇంట్లో డంప్‌చేసి, అవసరమైన వాళ్లకి విక్రయిస్తుంటారు. ఈక్రమంలో గంజాయిని కారులో తీసుకొస్తూ పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. నిందితులను హనుమకొండ పోలీసులకు అప్పగించగా ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యాంటీ నార్కొటిక్ డ్రగ్స్ కంట్రోల్ టీం, హనుమకొండ పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.